# వానప్రస్థం

అదో రైలు.

ఆ రైల్లో అదో ఫస్ట్ క్లాస్ బోగీ. ఆ బోగీలో అదో కూపే.

ఆ కూపేలో కిటికీ పక్కనే కూర్చుని బయటకి చూస్తున్నాడు రామం. రామాన్నే చూస్తోంది సీత. అలా చూస్తూనే–

"ఏంటలా తదేకంగా కిటికీలోంచి చూస్తున్నారు? ముళ్ళపూడి వారి కథలోలా – ఎంకీ, నాయుడు బావా కనిపిస్తారనా?" అని అడిగింది సీత.

"నా పక్కనే ఎంకివి నువ్వుండగా – ఇంకో ఎంకి కోసం చూడడమేంటి సీతా?" అని అడిగాడు రామం.

"అవును డెబ్బై మూడేళ్ళ ఎంకి. నండూరి వారు కానీ, ముళ్ళపూడి వారు కానీ ఊహించలేనంత ముసలి ఎంకి"

"ఊహించలేరు. ఎందుకంటే వాళ్ళు నిన్ను చూళ్ళేదు. చూసుంటే, వాళ్ళ ఎంకి నీ వయస్సుదే అయ్యుండేది"

సీత నవ్వలేదు. రామమే అన్నాడు –

"రైల్లో కిటికీ పక్కనే కూర్చుని బయట కనిపించే కొండలనీ, కాలవలనీ, పొలాలనీ చూస్తోంటే, ఎంత హాయిగా ఉంటుందో – నేనెప్పుడూ అందుకే కిటికీ పక్కనే కూర్చుంటాను"



"అవును కూర్చుంటారు. అయితే బయటికి చూడరు. యాభై యేళ్ళ క్రితం – పెళ్ళయి మనం ఇలాగే రైల్లో ఫస్ట్ క్లాస్ కూపేలో ప్రయాణం చేస్తున్నంత సేపూ – కిటికీలోంచి బయటకి చూసారా? కూపేలో ఉన్న నన్ను చూసారా?"

"నిన్నే చూసాను"

"మరిప్పుడు నన్ను చూస్తున్నారా?"

"లేదు. అయితే సీతా! అంత మాత్రాన నాకు నీ మీద ప్రేమ తగ్గిందని మాత్రం అనుకోకు. అప్పుడెంత ఉందో – అంతో, అంతకన్నా ఎక్కువో, ప్రేముంది నీపైన నాకు ఇప్పుడు"

"నాకు తెలియదా? మీ మీద నాకో, నా మీద మీకో – ప్రేమ తగ్గిందనుకునే భ్రమ లేదు నాకు. అయితే అప్పుడు శరీరాల మీద మమకారం ఉండేది. అందం మీద ఆశ ఉండేది. ఇప్పుడు అవేం లేవు. ఉత్త ప్రేమ. సీత మీద రామానికి, రామం మీద సీతకి"

"సీతా!" అన్నాడు ఏమనాలో తెలియక రామం.

సీత నవ్వలేదు. నవ్వకుండా –

"చూడండి. కదులుతున్న రైల్లోంచి చూస్తోంటే, దగ్గరున్నవి వేగంగా వెనక్కి వెళ్ళిపోతున్నట్లు, దూరంగా ఉన్నవి నెమ్మదిగా మనతో వస్తున్నట్లు కనిపిస్తాయి. ఎంత మాయో!" అని అంది.

"మాయే – అయినా అందంగా ఉంటుంది"

"మాయ – అందుకే అందంగా ఉంటుంది" అని, "చూడండి. ఇలా చూసే అవకాశం మళ్ళీ ఇంక రాదేమో" అంది సీత.

"అంటే?" అన్నాడు రామం.

"ఇదే మన ఆఖరి ప్రయాణం" అంది సీత.

"అంటే – మనం ఎక్కడికి వెళ్తున్నామో అక్కడ నుండి మళ్ళీ తిరిగి రామా?" అన్నాడు రామం.

"అవును రామా!" అంది సీత.

"అసలు మనం ఎక్కడకు వెళ్తున్నాం? ఎందుకు వెళ్తున్నాం? ఏమీ చెప్పకుండా ప్రయాణం చేసావు నన్ను. మనం తిరిగి రాకపోతే, మన ఇల్లు ఏమయిపోతుంది? మన సామాను..."

"ఎన్నాళ్ళు మనం ఆ ఇంటినీ, ఆ సామానుని అంటిపెట్టుకుని ఉంటాం? ఎప్పుడో ఒకప్పుడు వదిలెయ్యాలి కదా? ఇప్పుడే వదిలేద్దాం"

"నన్నెక్కడికి తీసుకెళ్తున్నావు సీతా?"

"యాభై ఏళ్ళ క్రితం నేను మీతో వచ్చేసాను. అలాగే ఈ రోజు మీరు నాతో వస్తున్నారు. ఆ రోజు నేను మీతో రావడానికి భయపడ్డానా? ఈ రోజు మీకు నాతో రావడానికి అంత భయం దేనికి?"

"భయమా? నాకు నీతో రాడానికా? ఏం మాట్లాడుతున్నావు సీతా? నీతో తప్ప ఇంకెవ్వరితోనైనా ఎక్కడికైనా ఇంత ధైర్యంగా వెళ్ళగలనా నేను? నాకు భయం లేదు. అయితే అసలెక్కడికి వెళ్తున్నాం? ఎందుకు వెళ్తున్నాం? అది అర్థం కావడం లేదు"

"ఈ సంసారాన్నీ, ఈ బంధాలనీ వదిలేసుకుని వెళ్ళిపోదాం"

"అంటే – మన ఇంటినీ, మన పిల్లలనీ వదిలెయ్యడమనేనా?"

"అవును. మనం పిల్లల్ని కన్నాం. పెద్దవాళ్ళని చేసాం. వాళ్ళు పెద్ద ఉద్యోగాలు చేసుకుంటూ సంపాదించుకుంటున్నారు. వాళ్ళకీ పిల్లలు పుట్టి పెరుగుతున్నారు. ఇంక మనం ఈ బంధాలకి దూరంగా వెళ్ళిపోవాలి. లేకపోతే, ఈ మాయలో ఇలానే ఉండిపోతాం"

"ఇక్కడ నుండి వెళ్ళిపోతే, ఈ మాయలోంచి బయటికి రాగలుగుతామా?"

"రాగలుగుతామో లేదో తెలియదు. ఇక్కడ ఉంటే మాత్రం రాలేం. శ్లేష్మంలో పడ్డ ఈగల్లా కొట్టుకుంటూనే ఉంటాం. మా అమ్మాయి మమ్మల్ని బాగా చూస్తుంది. మా కోడలంత మంచిది కాదు. మా మనవడు చాలా బాగా చదువుతాడు. ఇదిగో, ఈ ఝంఝూటంలోనే ఉండిపోతాం"

"ఇన్నాళ్ళూ దేన్ని మనం మన లోకం అనుకున్నామో – దాన్ని ఈ రోజు కాదనుకోడం ఎందుకు సీతా?"

"ఇన్నాళ్ళూ మనం అనుకుంటున్న లోకం కాకుండా మరో లోకం ఉందేమో మనకి తెలియదు. ఉన్నా దాని గురించి మనం తెలుసుకోగలమో లేదో తెలియదు.

అయితే మరణం మాత్రం నిజం. అది దగ్గరవుతున్నప్పుడయినా దాని తర్వాత ఏముందో ఆలోచించుకోవద్దా? ఈ సృష్టికి మూలం గురించి తెలుసుకుందుకు ప్రయత్నించవద్దా? ఉందో లేదో తెలియని – మరో జన్మకి మంచి బాట వేసుకోవద్దా?"

"మరో జన్మ – దానికి బాట – దాన్ని మనం వేసుకోవడం – ఏం మాట్లాడుతున్నావు సీతా?"

"మరో జన్మ ఉందో లేదో తెలియదు. అసలు ఉండడం అంటే ఏమిటో కూడా తెలియదు. మరణంతో శరీరం నశిస్తే, నశించకుండా ఉన్నదేదో మరో శరీరంలోకి ప్రవేశిస్తుందని కదా – పునర్జన్మ వాదుల సిద్ధాంతం. దాన్నే ఆత్మ అంటున్నారు.

ఆత్మకి మరణం లేదంటున్నారు. ఈ ఆత్మ ఒక శరీరాన్ని విడిచి మరో శరీరంలోకి వెడుతుదంటున్నారు. దాని నిజానిజాలు మనకి తెలియవు. ఒకవేళ అదే నిజమైతే, మన ఆత్మని మనం పవిత్రంగా ఉంచుకోవద్దూ? ఎందుకంటే ఆత్మ జీవిస్తూనే ఉంటుంది. ఈ జన్మ ఎక్కడ అంతం అవుతుందో, మరుజన్మ అక్కడ ఆరంభం అవుతుంది. ఈ జన్మ అంతం అయ్యేటప్పుడు ఏ ఆలోచనలు ఉంటాయో, మరో జన్మ వాటితోనే ప్రారంభం అవుతుంది”

“అంతా చూసినట్లు చెప్తున్నావు. ఇంతవరకూ ఒక్కరైనా మరణించిన వాళ్ళు మళ్ళీ మనకు కనిపించారా? మరణం తర్వాత ఆత్మలు మరో శరీరంలోకి ప్రవేశించినట్లు మనం కథలు వింటున్నాం. అవి నిజాలని ఎలా అనుకోగలం?”

“అనుకోలేం. అనుకోకూడదు కూడా. అయితే కొన్ని విషయాలను చూడండి. పుట్టిన నాలుగైదేళ్ళకే సంగీతం వచ్చేస్తోంది కొందరికి. ఎవ్వరి దగ్గరా నేర్వకుండా పెద్ద పెద్ద లెక్కలు చిన్న వయస్సులో చేసెయ్యగలుగుతున్నారు కొందరు. వాళ్ళకి ఆ విద్యలు ఎక్కడ నుండి వస్తున్నాయి? వాటినే పూర్వజన్మ వాసనలు అంటున్నారు. ఆ వాసనలు మనల్ని వదలవు. అంటి పెట్టుకునే ఉంటాయి”

“మనకి ఇంతకు ముందొక జన్మ ఉందో లేదో తెలియదు. ఈ జన్మలో మనకు పూర్వజన్మ జ్ఞాపకాలు ఏవీ లేవు. అలాగే వచ్చే జన్మలో కూడా ఉంటాయన్న నమ్మకం లేదు. పూర్వజన్మ జ్ఞానమే లేనప్పుడు దాని గురించి ఆలోచించడం ఎందుకు?”

“మనకి తెలిసినా, తెలియకపోయినా ఈ జన్మలోని ఆలోచనలు వచ్చే జన్మలో మనల్ని అంటిపెట్టుకుని ఉంటాయేమో. అసలు జన్మరాహిత్యమే లభిస్తుందేమో ప్రయత్నిస్తే. జన్మ జన్మకూ ఆత్మ జన్మరాహిత్యానికి దగ్గరై ముక్తి పొందుతుందని కదా అంటున్నారు. అలాంటప్పుడు మనం మంచి ఆలోచనలతో కాలం గడపడం మంచిది కాదూ?”

“ఆలోచనల్ని మంచిగా, మనం మన ఇంట్లోనే ఉంటూ, ఉంచుకుందుకు ప్రయత్నించవచ్చు కదా?”

“ప్రయత్నించవచ్చు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించే అవకావం తక్కువ. నా కూతురూ, నా కొడుకూ, నా మనవడూ, నా మనవరాలూ – ఈ బంధాలు మనల్ని మరో విషయం గురించి ఆలోచించనివ్వవు. ఇది కావాలి, అది కావాలి అన్న కోరిక పోదు. కోడలిని కష్టపెట్టడం, కూతురిని సుఖపెట్టడం, ఆస్తి పోతుందేమోననుకోవడం, కూతురు పిల్లలని కోడలిని పిల్లలకన్నా బాగా చూడడం – ఇవన్నీ చెయ్యకుండా ఉండగలమా?”

"ఇంత కాలం మనం అలా చేస్తున్నామా?"

"మీకేనిపిస్తోంది?"

"అలాగే అనిపిస్తోంది"

"అసలలా అనిపించకపోయినా, ఈ బంధాల మాయలో కొట్టుకుపోతున్నామా? లేదా? మనం మన పిల్లలని బాగా చూసాం, వాళ్ళు మనల్ని చూడాలి అన్న ఆలోచన కలుగుతోందా లేదా? చూడకపోతే బాధ కలుగుతోందా లేదా? వాటికి దూరంగా వెళ్ళి పోవాలి"

"అవును సీతా – వెళ్ళిపోవాలి. ఈ సంసారానికి దూరంగా వెళ్ళిపోవాలి. చాలా రోజులుగా నాకూ అలానే అనిపిస్తోంది. అయినా అలా వెళ్ళిపోవడం భయపడి పారిపోతున్నట్లుగా – పలాయనత్వంలా అనిపించి, అలా చెయ్యడం లేదు. ఆ మాట చెప్పడం లేదు"

"వెళ్ళాల్సిన చోటుకి వెళ్ళడం పలాయనత్వం కాదు"

"మనం వెళ్ళాల్సిన చోటు ఏది?"

"మనుషులు నిర్మించిన ప్రపంచానికి దూరంగా – ప్రకృతికి దగ్గరగా"

"అంటే, అడవులకా?"

"అలాంటి చోటుకి, ఈ జనారణ్యానికి దూరంగా"

"మనం ఇలా వెళ్ళిపోయామని తెలిసి, మన పిల్లలు బాధ పడరూ?"

"పడతారు – పడితే–"

"వాళ్ళని బాధపెట్టడం సరయిన పనేనా?"

"ఎన్నాళ్ళని వాళ్ళని మనం చూస్తాం. వాళ్ళ బాధలనీ, సుఖాలనీ వాళ్ళు చూసుకోగలరు. వాళ్ళ కోసం మనం మన మార్గాన్నీ మన గమ్యాన్నీ వదిలేసుకుంటామా?"

"వాళ్ళ కోసం కాదు. మన కోసం. మన అవసరాల కోసం"

"మనకేం అవసరాలుంటాయి?"

"ఎందుకుండవు? మనకేం కావల్సివచ్చినా, చూడాల్సింది మన పిల్లలే కదా? వాళ్ళు చూస్తామనే అంటున్నారు కదా. అలాంటి వాళ్ళని వదిలేసి వెళ్ళడం ఎందుకు?"

"అసలు మనకు అవసరాలు లేవు. ఉండకూడదు. పిల్లల్ని పెంచి పెద్ద చెయ్యడం తల్లితండ్రుల కర్తవ్యం. అయితే పెద్దవాళ్ళని చూడ్డం పిల్లల పని కాదు. ఎందుకంటే పిల్లలు వాళ్ళ పిల్లల్ని పెంచి పెద్ద చేయాలి. ముసలివాళ్ళని చూడ్డంలో వాళ్ళు వాళ్ళ పిల్లల భవిష్యత్తుని విస్మరించకూడదు. అలా జరిగితే ఏ తరమూ, ముందు తరాన్ని ముందుకు నడిపించలేదు"

"ఈ లోకమంతా మాయ. దీన్ని వదిలిపెట్టాలని అంటావు ఒక పక్క. ఇంకో పక్క ప్రతి తరం ముందుకి వెళ్ళాలంటావు. ఈ రెంటికీ లంకె ఎలా కుదురుతుంది సీతా?"

"ఎందుకు కుదరదు – కుదురుతుంది. ఈ వయస్సులో మనం తెలుసుకోవల్సింది ఈ విశ్వరహస్యం గురించి. మన గమ్యం భగవదైక్యం. మన మనవలూ, మనవరాళ్ళూ తెలుసుకోవల్సింది ఈ ప్రపంచంలో బతికే మార్గం. దాన్ని వాళ్ళకి చూపించడం మన పిల్లల కర్తవ్యం. మనకీ, వాళ్ళకీ ఒకటే గమ్యం ఉండదు. మన మార్గాలు ఒకటవవు"

"మన గమ్యం భగవదైక్యమా?"

"కాక? – మనం ఎందులోంచి పుట్టామో, ఎందులో లీనమవుతామో అదే కదా భగవంతుడు. మధ్య ఉన్నదంతా మాయ. మనం అన్నది మన శరీరమే అయితే, జనన మరణాలే ఆదీ, అంతం. అప్పుడు మరణమే భగవదైక్యం. అలా కాక మనం అన్నది ఆత్మ అయితే అది జనన మరణాల శృంఖలాలనెన్నిటినో చూసి చూసి, చివరి కెప్పుడో కర్మ పరిపక్వం చెందినప్పుడు భగవదైక్యం చెందుతుంది. ఆ కర్మ పరిపక్వానికి అది ప్రతి జన్మలోనూ ప్రయత్నించాలి"

"అలాగనే మన మహర్షులు చెప్పారు. రామకృష్ణుడైనా, అరవిందుడైనా, రమణుడైనా చెప్పింది అదే"

"నేనేం కొత్తగా చెప్తున్నానని అనడం లేదు. మనం కొత్త మార్గం వెతకడం లేదు. ఆ మహర్షులు చెప్పిన మార్గంలో వెళ్ళేందుకు ప్రయత్నిస్తాం. వాళ్ళందరూ భగవంతుణ్ణి చేరడానికి చెప్పిన మార్గం ధ్యానం. ధ్యానం అంటే ఏదో ఒక్క విషయం పైనే మనస్సుని లగ్నం చెయ్యాలి. మనస్సుకి ఇంకో ఆలోచన కలగకూడదు. అందుకే మనస్సుకి మరో ఆలోచన కలగని చోటుకి మనం వెళ్ళిపోవడం. అక్కడ మన ధ్యానానికి అంతరాయం ఉండదు"

"ఒకవేళ భగవంతుడు సత్యం కాకపోతే – ఈ మహర్షులు చెప్పిన మార్గం సరయింది కాకపోతే–"

"కాకపోయినా మనకేమీ అవదు. అదే యాభై ఏళ్ళ క్రితం అయితే, ఆ సంగతి వేరు"

"అంటే?"

"అంటే" అని ఆలోచిస్తున్నట్లు చూసి, రామం జేబులోంచి పెన్ను తీసుకని తన దగ్గరున్న పేపర్ మీద రాయడం మొదలెట్టింది సీత. సీత రాస్తున్నది చూస్తున్నాడు రామం.

సీత రాసిందిలాగుంది.

**ముసలివాళ్ళకి**

| | | మహర్షులు చెప్పిన మార్గం సత్యం | |
|---|---|---|---|
| | | అవును | కాదు |
| మహర్షులు చెప్పిన మార్గంలో | ప్రయత్నిస్తే | ఉపయోగకరం | ఈ వయస్సులో చెయ్యాల్సిన పనులు లేవు. పెద్ద నష్టం లేదు |
| | ప్రయత్నించకపోతే | నష్టం | లాభనష్టాలు లేవు |

**పడుచువాళ్ళకి**

| | | మహర్షులు చెప్పిన మార్గం సత్యం | |
|---|---|---|---|
| | | అవును | కాదు |
| మహర్షులు చెప్పిన మార్గంలో | ప్రయత్నిస్తే | ఉపయోగకరం | ఈ వయస్సులో చెయ్యాల్సిన పనులుంటాయి. అవి చెయ్యకపోతే, చాలా నష్టం |
| | ప్రయత్నించకపోతే | నష్టం | లాభనష్టాలు లేవు |

తను రాసినదాన్ని చూపిస్తూ సీత చెప్తోంది –

“యాభై యేళ్ళ క్రితం మనం పడుచువాళ్ళం. మనకి ఈ లోకంలో చెయ్యాల్సిన పనులు చాలా ఉన్నాయి. పిల్లల్ని కనడం, వాళ్ళని పెంచడం, పెద్దవాళ్ళని చెయ్యడం. ఇప్పుడు అవేం లేవు. ఇప్పటి మనకీ, అప్పటి మనకీ మార్గాలూ, గమ్యాలూ వేరు.

“మనం లెక్కల్లో గేమ్ థీయరి గురించి పే ఆఫ్ మేట్రిక్స్ గురించీ చదివాం. అదే గీసాను ఇందులో.

“మనం ముసలివాళ్ళం. మనకి చెయ్యాల్సిన పనులు లేవు. అందుకే భగవంతుడు సత్యమనీ, ఆయన దగ్గరకి చేరడానికి ధ్యానం మార్గం అనీ నమ్మడం వల్ల, మనకీ,

మన వాళ్ళకీ నష్టం లేదు. భగవంతుడు అసత్యమైనా, ఈ మార్గం మనల్ని అక్కడకి చేర్చకపోయినా ఫరవాలేదు.

"యాభై ఏళ్ళ క్రితం మనం పడుచువాళ్ళం. అప్పుడు భగవంతుడూ, ధ్యానం అంటూ కాలం గడిపి ఉంటే, మనకీ, మన పిల్లలకీ నష్టం వచ్చి ఉండేది. అప్పటి పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితి వేరు. ఇప్పుడు మనకి –"

సీత చెప్తోంది.

రామం వింటున్నాడు.

❋ ❋ ❋

రైలు ఆగింది.

ఇద్దరూ బయటికొచ్చి టాక్సీలో కూర్చున్నారు. ఎక్కడికి వెళ్ళాలని సీత చెప్పిందో, అక్కడకెళ్ళి ఆగింది టాక్సీ.

రామం దిగి చుట్టూ చూసాడు.

ఒక పక్క గలగలా పారుతున్న గోదావరి. గోదావరి ఒడ్డునే పెద్ద మామిడి తోట. ఆ తోటలో అక్కడక్కడా చిన్న కుటీరాలు. రెల్లు దుబ్బుతో అందంగా అల్లిన కుటీరాలు.

ఆ కుటీరాల వైపుకి నడిచింది సీత. వెనకే కదిలాడు రామం.

ఓ కుటీరంలోకి దారి తీసింది సీత. అనుసరించాడు రామం.

విశాలంగా ఉంది కుటీరం. ఒక పక్క వంటకి కావల్సిన సదుపాయాలన్నీ ఉన్నాయి. మరో పక్క పడకకి కావల్సిన సరంజామా ఉంది. ఆ గదికి ఆనుకొని స్నానాల గది.

"మనకి కావల్సినవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎలా ఏర్పాటు చేసావు సీతా?" అని అడిగాడు రామం.

"ఇక్కడ అందరూ మనలాంటి వాళ్ళే. అన్ని కుటీరాల్లోనూ మనలాంటి దంపతులే. ఇలాంటి సదుపాయాలే" అంటూ కుటీరం బయటకి వచ్చింది సీత. వెనకాలే వచ్చిన రామానికి గోదావరిని చూపిస్తూ –

"మనకిప్పుడు కావల్సింది సత్సాంగత్యం – అదిగో, ఆ నదే – ఆ గోదావరే – మనకి సత్సాంగత్యం"

– అని మరో పక్కనున్న గుడిని చూపిస్తూ –

"అదిగో, ఆ గుడే మన ధ్యానాలయం" అంది.

"ఇంకా" అని అడిగాడు రామం.

"ఇంకేం కావాలి? టీవీయా?" అని అడిగింది సీత.

"టీవీ అక్కర్లేదు కానీ..."

"పేపరా? ఆ పక్కన ఒక లైబ్రరీ ఉంది. అందులో అన్నీ వేదాంత గ్రంథాలే. పేపర్ వస్తుందేమో కనుక్కోవాలి"

"అన్నీ బావున్నాయి. వైద్య సదుపాయం"

"ఎందుకు వైద్య సదుపాయం?"

"మనకి ఏదన్నా రోగం వస్తే?"

"వస్తే – వస్తే ఏమవుతుంది? చిన్న రోగాలకి మనమే మందులు వేసుకోవచ్చు. పెద్ద రోగాలు వచ్చాయా – వాటి మానాన వాటిని వదిలెయ్యాలి. గుండె కొట్టుకుంటూనే ఉండాలని అనుకోకూడదు"

"నా గురించి కాదు – నీ గురించి"

"నా కయినా, మీ కయినా అంతే. డెబ్బై ఏళ్ళు దాటాయి. ఇంకా ఈ శరీరం మీద మమకారం ఎందుకు?"

"అలాగని మరణం కోసం ఎదురు చూస్తామా?"

"మరణం అంటే ఏమిటి? శరీర విసర్జనం. మన ప్రయత్నం ఫలిస్తే – ఈ శరీరాన్ని వదిలేసిన ఆత్మ – భగవంతునిలో లీనమైపోతుందేమో. ఆ ఐక్యం కోసం ఎదురు చూద్దాం. ఆ దివ్య సాక్షాత్కారం కోసం వేచి ఉందాం. దాని కోసం కలలు కందాం. దాని కోసం ధ్యానం చేద్దాం. ఒకవేళ భగవంతుడిలో కలవకపోయినా, ఆ ధ్యానం, ఆ కలలు అందంగా ఉంటాయి. ఆనందాన్నిస్తాయి"

రామం మాట్లాడలేదు. సీత అడిగింది –

"మీకీ పరిసరాలు నచ్చలేదా? నేనిలా తీసుకువచ్చానని కోపంగా ఉందా?"

రామం అన్నాడు –

"సీతా! నీ మీద నాకు కోపమా? దేని నుండి బయటపడాలని ఆశపడుతున్నానో, దాని నుండి బయటకు తీసుకువచ్చావు. దేని కోసం ప్రయత్నిద్దామని కోరుకుంటు న్నానో, దాని కోసం ప్రయత్నించేందుకు అవకాశం కల్పించావు. నన్నిలా తీసుకు వచ్చావని నీ మీద నాకు కోపమా? నీకు కృతజ్ఞుడినై ఉండాలి కానీ–"

"కృతజ్ఞతలు నాకు కాదు. ఇవన్నీ నాకు చెప్పి నా చేత చేయించింది సుజాత" అని అంది సీత.

"ఏ సుజాత?" అని అడిగాడు రామం.

"ఏ సుజాత అని అడుగుతున్నారు? ఎందరు సుజాతలు తెలుసు మీకు?"

"నాకూ, నీకూ తెలిసిన సుజాత ఒక్కతే. ఆ సుజాత ఈ పాటికి మన ఇంట్లోని సామానుని ఊళ్ళోని అనాధాశ్రమానికి తరలిస్తూ ఉండి ఉంటుంది" అన్నాడు రామం.

సీత రామం వైపు అనుమానంగా చూసింది.

"ఈ ఆశ్రమం గురించి సుజాతకి ఎలా తెలుసుట?" అని అడిగాడు రామం.

"ఎవరో అంకుల్ చెప్పారని అంది" అని అంది సీత – రామం వైపు అనుమానంగా చూస్తూనే.

"రామం అంకుల్ అని చెప్పలేదా?" అని అడిగాడు రామం.

"మీరేనా సుజాత చేత..." అంటూ ఆగింది సీత.

రామం నవ్వాడు.

సీత నవ్వలేదు. నవ్వకుండా –

"మీరు ఈ విషయాలన్నీ చెప్పి నన్ను రమ్మని ఉంటే, మీ వెనక వచ్చి ఉండేదాన్ని కాదా? ఎందుకు సుజాత ద్వారా చెప్పించి, నా చేత చేయించి – నా వెనుక మీరు..." అని సీత అంటోంటే –

"సీతా! పెళ్ళయిన వెంటనే నువ్వు నాతో వచ్చావు. ఆ తర్వాత ఎప్పుడూ ఇద్దరం కలిసే ప్రయాణం చేసాం. ఈసారి నీ వెనుక నేను ప్రయాణం చేద్దామని"

"ఎప్పటిలాగే మీరు నా వెనుక కాదు. ఎప్పుడూ నేను మీ వెనుకే"

"అన్ని ప్రయాణాలూనా?" అని అడిగాడు రామం.

రామం అడిగింది అర్థం అయినట్లు సీత –

"ఆ ప్రయాణం మాత్రం కాదు" అని అంది.

"అన్ని ప్రయాణాలూ మనం కలిసే చేసాం సీతా. భగవంతుడు అనుగ్రహిస్తే – ఆయన దగ్గరికి ప్రయాణం కూడా కలిసే చేస్తాం" అని అంటున్న రామం కంఠం వణికింది.

వింటున్న సీత కళ్ళలో తడి ఉబికింది.

గోదావరి – ఎప్పటిలాగే – గంభీరంగా – ప్రవహిస్తూనే ఉంది. ❋

